
www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

మంగళవారం
06.10.2026






రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులకు కరెంట్ షాక్ తగిలింది. ట్రూఅప్ ఛార్జీల సర్దుబాటు పేరుతో ప్రజలపై ఏకంగా రూ.7,635.22 కోట్ల మేర మోయలేని భారం పడనుంది. గత రెండేళ్లకు సంబంధించిన విద్యుత్ కొనుగోళ్లు, రాబడి లోటును భర్తీ చేసుకునేందుకు రెండు డిస్కంలకు ఈఆర్సీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నవంబర్ బిల్లుల నుంచే అదనపు వసూళ్లు మొదలుకానున్నాయి. ఉచిత విద్యుత్ పొందుతున్న వ్యవసాయ రంగానికి మినహాయింపునిచ్చి ఆ మొత్తాన్ని ప్రభుత్వానికే బదలాయించినప్పటికీ, గృహ, వాణిజ్య, పారిశ్రామిక వర్గాలపై యూనిట్‌కు 50 పైసల వరకు బాదుడు తప్పేలా లేదు. ఒకవైపు నిత్యావసరాల ధరలతో సతమతమవుతున్న సామాన్యుడిపై మరో రెండున్నరేళ్ల పాటు ఈ ట్రూఅప్ భారం పడనుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

వెలుగుల మాటున ట్రూ-అప్ వాత!

యూనిట్‌కు 50 పైసల అదనపు భారం

■ డిస్కంల నష్టాలను వినియోగదారులే భరించాలి ■ ఈఆర్సీ అధికారిక ఉత్తర్వులు జారీ



కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 05) : రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులపై సర్దుబాటు (ట్రూఅప్) ఛార్జీల పేరిట భారీ ఆర్థిక భారం పడింది. 202223, 202324 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన విద్యుత్ కొనుగోలు, రాబడి ట్రూఅప్ మొత్తాల్లో రూ.7,635.22 కోట్లను రెండు డిస్కంల ద్వారా రాబట్టుకునేందుకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) పచ్చజెండా ఊపింది. కమిషన్ ఛైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున, సభ్యులు రఘు కంచర్ల, చెరుకూరి శ్రీనివాసరావులతో కూడిన కమిషన్ సోమవారం ఈ మేరకు కీలక నిర్ణయాన్ని వెలువరించింది.

నవంబర్ నుంచే అదనపు వసూళ్లు..

రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారుల నుంచి వచ్చే నవంబర్ నెల బిల్లుల నుంచే ట్రూఅప్ ఛార్జీల వసూళ్లు షురూ కానున్నాయి. మొత్తం రూ.7,635.22 కోట్ల భారం తేలగా, వ్యవసాయ వాటా పోను మిగిలిన రూ.5,420.23 కోట్లను ఇతర గృహ, వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ వినియోగదారుల నుంచి రాబట్టనున్నారు. ఇందులో దక్షిణ డిస్కం (టీజీఎన్‌పీడీసీఎల్) పరిధిలో రూ.4,222.93 కోట్లు, ఉత్తర డిస్కం (టీజీఎన్‌పీడీసీఎల్) పరిధిలో రూ.1,197.30 కోట్లను సర్దుబాటు చేయాలని మండలి నిర్ణయించింది.

యూనిట్‌కు 50 పైసల భారం..

ప్రజలపై ఒకేసారి తీవ్ర భారం పడకుండా తొలి నెల నవంబర్‌లో యూనిట్‌కు 30 పైసలు మాత్రమే వసూలు చేయనున్నారు. ఆ తర్వాతి నెల డిసెంబర్ నుంచి మాత్రం యూనిట్‌కు 50 పైసల చొప్పున ట్రూఅప్ రికవరీ కొనసాగుతుంది. దక్షిణ డిస్కం పరిధిలో 29 బిల్లింగ్ నెలలు, ఉత్తర డిస్కం పరిధిలో 26 బిల్లింగ్ నెలల పాటు ఈ అదనపు బాదుడు సాగనుంది. వినియోగదారుడి గత వాడకం ఆధారంగా నెలవారీ లెక్కలను ఖరారు చేయనున్నారు.

రైతాంగానికి మినహాయింపు..

రాష్ట్రంలోని వ్యవసాయ రంగానికి ట్రూఅప్ ఛార్జీల నుంచి పూర్తి ఊరట లభించింది. రెండు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన వ్యవసాయ విద్యుత్ భారం రూ.2,214.99 కోట్లను రైతుల నెత్తిన మోపకుండా ప్రభుత్వమే భరించాలని, నేరుగా డిస్కంలకే చెల్లించాలని టీజీఈఆర్సీ ఆదేశించింది. ఉచిత విద్యుత్ విధానాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులకు ఎలాంటి భారం పడకుండా ప్రభుత్వం నుంచే ఆ పైసలు రాబట్టాలని నిర్ణయించింది.

బిల్లులో ప్రత్యేక వివరాల నమోదు..

ప్రతి నెలా ఇచ్చే విద్యుత్ బిల్లులో ట్రూఅప్ ఛార్జీలను సాధారణ వినియోగ బిల్లుతో కలపకుండా ప్రత్యేకంగా చూపించాలని ఈఆర్సీ స్పష్టం చేసింది. ఏ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎంత రేటు వేశారు, ఎన్ని యూనిట్ల వినియోగంపై లెక్కించారో వివరంగా నమోదు చేయాలని నిబంధన విధించింది. మొదటి బిల్లు జారీకి ముందే అన్ని ప్రముఖ దినపత్రికల్లో విస్తృత ప్రచారం కల్పించి ప్రజలకు అవగాహన కల్పించాలని డిస్కంలను ఆదేశించింది.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
మంగళవారం 06.10.2026
2
www.kalamjyothi.com

రూ.23.35 కోట్ల అభివృద్ధి పనులు

- మౌలిక వసతుల కోసమే నిధులు వెచ్చిస్తున్నాం
- నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి
- ప్రజలకు సత్వరమే ప్రభుత్వ సేవలు అందిస్తాం
- మంత్రులు పొంగులేటి, జూపల్లి



కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 05) : నిర్మల్ జిల్లా పరిధిలో ప్రజలకు మరింత మెరుగైన మౌలిక వసతులు, ప్రభుత్వ సేవలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రులు శ్రీకారం చుట్టారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో దాదాపు రూ.23.35 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనుల శిలాఫలకాలను రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి ఆవిష్కరించి శంకుస్థాపనలు చేశారు. అంతకుముందు జిల్లా పర్యటనకు చేరుకున్న మంత్రులతో పాటు రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల ఉన్నతాధికారులు డి.ఎస్. లోకేష్‌కుమార్, రాజీవ్‌గాంధీ హనుమంతు, వి.పి. గౌతమ్‌లకు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, అధికారులు ఘన స్వాగతం పలికారు.

నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి..

వివిధ శాఖలు సంయుక్తంగా చేపట్టనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి రహదారుల నిర్మాణ పనులతో పాటు రిజిస్ట్రార్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణ పనులను ప్రారంభించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండేలా ప్రభుత్వ సేవలను విస్తరించడంతో పాటు ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు చేపడుతున్న ఈ పనులను నిర్ణీత గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు భవేశ్ మిశ్రా, రాజర్షి షా, హరిత, నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, ఆర్ ఎస్ చిత్రు, చంద్రయ్య, రాములు, దేవిడ్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఉట్నూర్ ఐటిడిఏ పిఓ మంద మకరందు, సబ్ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ దరఖాస్తులను పరిష్కరించాలి

- పెండింగ్ సమస్యలను వెంటనే తేల్చాలి
- ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి
- అర్హులైన వారందరికీ ప్రయోజనాలు చేరాలి
- మంత్రులు పొంగులేటి, జూపల్లి



కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 06) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ దరఖాస్తులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర మంత్రులు అధికారులను ఆదేశించారు. నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాల సమీక్షా సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటిశ్రీనివాస్‌రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. కలెక్టర్లు, ఉన్నతాధికారులతో కలిసి రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల పరిధిలోని పలు కీలక అంశాలు, ప్రజా సమస్యలు, అభివృద్ధి పనుల పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి భూ సమస్యలు, భూ పరిపాలన, రికార్డుల నిర్వహణ, భూ సంబంధిత దరఖాస్తుల పరిష్కారం, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల అంశాలపై ఆరా తీశారు. ప్రజలకు రెవెన్యూ సేవలు సులభంగా, పూర్తి పారదర్శకంగా అందేలా పక్కా చర్యలు చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి..

ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల అమలు, అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ, ఇళ్ల నిర్మాణ పురోగతి, పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలపై మంత్రులు వివరాలు తెలుసుకున్నారు. నిరుపేదలైన అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు దక్కేలా అధికారులు సమన్వయంతో బాధ్యతగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మంజూరైన ప్రతి ఇంటి నిర్మాణం నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాల వారీగా రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల పనితీరును సమీక్షిస్తూ, ప్రజల సమస్యలను ప్రాధాన్య క్రమంలో త్వరితగతిన పరిష్కరించాలని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా శాఖల మధ్య సమన్వయంతో పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) లోకేష్‌కుమార్, రెవెన్యూ శాఖ (రిజిస్ట్రేషన్లు, స్టాంపులు) ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత, ఐటీడీఏ పీవో మంద మకరందు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ, గృహ నిర్మాణ, అటవీ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

పాత మద్దంపురం సర్పంచ్
నమూమాస కరుణాకర్

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 05) : చెన్నారావుపేట మండలంలోని పాత మద్దంపురం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత పేద కూలీలకు స్థానికంగా పనులు కల్పిస్తూ వలసలను నివారించడంతో పాటు, గ్రామాభివృద్ధికి దోహదపడేలా పనులను సమర్థవంతంగా చేపడుతున్నట్లు తెలిపారు. అర్హులైన కూలీలందరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ననుమాస కరుణాకర్, ఉపసర్పంచ్ అలువాల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రావణ కుమారి, వార్డు సభ్యులు కొయ్యల స్వప్న, సంపత్, లక్ష్మణచారి, రమేష్, అనిత, హసీనా, ఫీల్డ్ అసిస్టెంట్ పోగుల సురేందర్, పంచాయతీ సిబ్బంది సాంబయ్య, కుమార్, ఐలుమల్లు, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వెల్జీపురానికి సబ్‌స్టేషన్ మంజూరు



కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 06) : ఇల్లంతకుంట మండలంలోని వెల్జీపురం గ్రామానికి నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు కావడంతో గ్రామ కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాయిని నవీన్‌కుమార్ మాట్లాడుతూ వెల్జీపురం గ్రామ రైతులు గత కొన్నేళ్లుగా లోఓల్టేజ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి సబ్‌స్టేషన్ మంజూరు చేయించారని పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుతో రైతులకు విద్యుత్ సమస్యలు శాశ్వతంగా పరిష్కారమై పంటలకు ఎంతో మేలు జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ గుండ వెంకటేశం, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లకొమటి శంకర్ యాదవ్, వార్డు సభ్యుడు బోజ్జు శ్రీనివాస్, గ్రామ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

తారక ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా బాలరాజు



కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 06) : ఇల్లంతకుంట మండల కేంద్రంలో తారక ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా కునబోయిన బాలరాజు ముదిరాజ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కునబోయిన కార్తీక్, రామస్వామి, ప్రధాన కార్యదర్శిగా రేగుల కార్తీక్, రైటర్‌గా కునబోయిన వేణు, క్యాషియర్‌గా సాన నర్సయ్య, గౌరవ అధ్యక్షుడిగా కునబోయిన శంకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు ముదిరాజ్ సంఘ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అభివృద్ధితో పాటు ముదిరాజ్ సమాజ ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ, సభ్యుల సంక్షేమానికి నూతన కార్యవర్గం బాధ్యతగా కృషి చేయాలని ఆకాంక్షించారు.



ఆర్టీసీ ఎన్నికల్లో ఐక్య కూటమి ప్రచారం

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 06) : ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో నిర్మల్ ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఐక్య కూటమి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ అనుబంధ యూనియన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్టీసీలో ఎన్నికలు నిర్వహించిన తర్వాత ఇప్పటివరకు ఎన్నికలు జరపలేదని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారంతో పాటు ఆర్టీసీని ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో విలీనం చేసే అంశాలపై రాబోయే రోజుల్లో రాజీలేని పోరాటాలు సాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బొమ్మెన సురేష్, జక్కుల మల్లేష్, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ మంత్రి వేణుగోపాల చారి, యూనియన్ డిపో కార్యదర్శి నారాయణ, డిపో అధ్యక్షుడు లింగన్న, సహాయ కార్యదర్శి రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు వెంకటేష్, కరీంనగర్ జోనల్ మహిళా కార్యదర్శి తాళ్ల అశ్విని తదితరులు పాల్గొన్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
3
మంగళవారం 06.10.2026
www.kalamjyothi.com



రాష్ట్రస్థాయి నెట్‌బాల్‌కు
సిద్ధార్థ విద్యార్థులు

జిల్లా పోటీల్లో 12 మంది ప్రతిభ

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 05) : హనుమకొండలోని జేఎస్ఎన్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన చెన్నారావుపేట సిద్ధార్థ హైస్కూల్‌కు చెందిన 12 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యారని విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో మేడ్చల్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాఠశాల క్రీడాకారులు పాల్గొంటారని వెల్లడించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ వీరమల్ల మాధవరెడ్డి, ప్రిన్సిపాల్ అండేం కరుణాకర్‌రెడ్డి, కోచ్ కోరుకొండ ప్రణయ్‌గౌడ్ విద్యార్థులను ఘనంగా సత్కరించారు. రాష్ట్రస్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు పొన్నం రమేష్, ఆరే రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



యాదవ సంఘం మండల కమిటీ ఎన్నిక
అధ్యక్షుడిగా రాములుయాదవ్

- కులబాంధవుల సంక్షేమానికి సమష్టిగా కృషి చేస్తాం

కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 06) : ఇల్లంతకుంట మండల శ్రీకృష్ణ యాదవ సంఘం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని శ్రీరాజ రాజేశ్వర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల యాదవ సంఘం అధ్యక్షులు, కులబాంధవులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా గొల్లపల్లె గ్రామానికి చెందిన ఓరుపుల రాములు యాదవ్‌ను మండల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సమాజ ఐక్యతే లక్ష్యంగా పనిచేయాలి..

నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా పయ్యావుల బాలరాజు (సిరికొండ), ప్రధాన కార్యదర్శిగా బోలవేణి అజయ్ (తిప్పాపూర్), కార్యదర్శిగా జుర్రు రాజయ్య (వెల్జిపూర్), క్యాషియర్‌గా మల్యాల రాజశేఖర్ (అనంతారం) బాధ్యతలు చేపట్టారు. కార్యవర్గ సభ్యులుగా దొరగొల్ల కొమురయ్య (సోమారంపేట), దుగ్యాని కుంటయ్య (రేపాక), తూముల మహేష్ (పెద్దలింగాపూర్), నరిగే శ్రీనివాస్ (వెల్జిపూర్), దారవేణి ఎల్లయ్య (వెంకట్రావుపల్లె) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు సంఘం నాయకులు, బాంధవులు శుభాకాంక్షలు తెలుపుతూ, సమాజ ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ సభ్యుల సంక్షేమానికి నూతన కమిటీ నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు.

మళ్లీ 'మర్రి' రాజకీయ చర్చ

- గ్రామం నుంచి పట్టణం వరకు వినిపిస్తున్న పేరు
- అందుబాటులో ఉండే నాయకుడనే అభిప్రాయం
- యువతలో ఆసక్తి, భవిష్యత్ సమీకరణాలపై ఆరా
- రాబోయే రోజుల్లో మార్పులకు సంకేతమా?



కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 06) : నాగర్‌కర్నూల్ నియోజకవర్గ రాజకీయాల్లో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి పేరు మరోసారి జోరుగా చర్చనీయాంశంగా మారుతోంది. పట్టణం మొదలుకొని మారుమూల గ్రామీణ ప్రాంతాల వరకు రాజకీయ వర్గాల్లో, సాధారణ ప్రజానీకంలో ఆయనపై విస్తృత చర్చ జరుగుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. చాయ్ హోటళ్ల నుంచి పల్లె రచ్చబండల దాకా, యువత నుంచి వృద్ధుల వరకు వివిధ వర్గాల ప్రజలు ఆయన పేరును ప్రస్తావిస్తుండటం స్థానికంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుత పరిస్థితుల్లో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో పాలుపోవడం లేదని, గతంలో మర్రికి ఫోన్ చేస్తే వెంటనే స్పందించడమే కాకుండా అవసరమైతే తిరిగి ఫోన్ చేసి వివరాలు ఆరా తీసేవారని పలువురు గతాన్ని గుర్తుచేసుకుంటున్నారు.

వ్యక్తిగత సంబంధాలు..

మర్రి జనార్దన్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానంలో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే నాయకుడిగా గుర్తింపు పొందారనే భావన వ్యక్తమవుతోంది. తనకు రాజకీయంగా మద్దతు ఇవ్వని ప్రత్యర్థులను సైతం వ్యక్తిగతంగా దూరం పెట్టకుండా వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపేవారని అనుచరులు పేర్కొంటున్నారు. ఎన్ని కల్లో సహకరించకపోయినా పనులు చక్కబెట్టి, భవిష్యత్తులో తనకు అండగా నిలవాలని కోరే విలక్షణ శైలి ఆయన సొంతమని స్థానికులు చెబుతుంటారు. పార్టీలకు అతీతంగా ప్రజలతో నెరిపిన ఆత్మీయ సంబంధాలే నేడు ఆయనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆత్మీయ తోడ్పాటు..

నియోజకవర్గంలో జరిగే వివాహాలు, ప్రజా సమావేశాలు, ఇతర శుభకార్యక్రమాలకు హాజరై ప్రజలతో మమేకం కావడం ఆయన శైలిగా ఉండేది. పలు సందర్భాల్లో సామూహిక భోజన ఏర్పాట్లు చేయడంతో పాటు, చిన్నపాటి ధర్నాలు, ఆందోళనలు జరిగినప్పుడు నిరసనకారులకు తాగునీటి వసతి కల్పించడం లాంటి అంశాలను ప్రజలు ఇప్పటికీ గుర్తుచేసుకుంటున్నారు. ఇలాంటి సుదీర్ఘ వ్యక్తిగత అనుబంధాలే ప్రస్తుత రాజకీయ శూన్యతలో ఆయన పేరు మళ్లీ తెరపైకి రావడానికి ప్రధాన కారణమవుతున్నాయనే చర్చ నడుస్తోంది.

యువతలో పెరుగుతున్న ఆసక్తి, రాజకీయ గ్రాఫ్..

నియోజకవర్గ పరిధిలోని యువతలో కూడా మర్రి జనార్దన్ రెడ్డి రాజకీయ భవిష్యత్తుపై తీవ్ర ఆసక్తి వ్యక్తమవుతుండటం గమనార్హం. గతంలో ఆయనతో కలిసి నడిచిన పాత శ్రేణులతో పాటు, నూతన తరం కూడా ఆయన రాజకీయ కార్యాచరణ, పునరాగమనంపై లోతుగా ఆరా తీస్తోంది. ప్రజల్లో ఆయన పట్ల వ్యక్తమవుతున్న ఈ సానుకూల ధోరణి ఆయన రాజకీయ గ్రాఫ్ క్రమంగా పెరుగుతోందనడానికి నిదర్శనమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

భవిష్యత్ సమీకరణాలపై సస్పెన్స్..

రాబోయే ఎన్నికల నాటికి నియోజకవర్గంలో రిజర్వేషన్ల మార్పులు ఉంటాయా, లేక ప్రస్తుత పరిస్థితిలోనే మర్రి జనార్దన్ రెడ్డి మళ్లీ బరిలోకి దిగుతారా అనే అంశాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ సమీకరణాలు మారి రిజర్వేషన్లు మారితే ఆయన కుటుంబం నుంచి భార్య, కుమారుడు రంగంలోకి వస్తారా లేక సన్నిహితులు ప్రాతినిధ్యం వహిస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. నాగర్‌కర్నూల్ రాజకీయ యవనికపై మర్రి పేరు మళ్లీ ప్రతిధ్వనించడం కేవలం గత జ్ఞాపకాల ప్రస్తావన మాత్రమేనా లేక పెను మార్పులకు సంకేతమా అనేది రానున్న కాలమే తేల్చాల్సి ఉంది.

మైనర్ రిపేర్ల పేరిట భారీ నిధుల కేటాయింపు

- దసరా వేళ మినీ ట్యాంక్‌బండ్‌కు మరమ్మతులు
- టెండర్ రాకముందే పైరవీల జోరు
- ఒకే వర్గానికి పనులు దక్కుతున్నాయన్న ఆరోపణలు

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 06) : దసరా పండుగ వేళ నాగర్‌కర్నూల్ పట్టణంలోని మినీ ట్యాంక్‌బండ్ సుందరీకరణ పనులకు రంగం సిద్ధమవుతోంది. ట్యాంక్‌బండ్‌పై దెబ్బతిన్న గ్రానైట్ బండలు, స్ట్రీట్‌లైట్లు, రోడ్డు డివైడర్ల మరమ్మతుల కోసం సుమారు రూ.15 లక్షలు మంజూరైనట్లు తెలుస్తోంది. అయితే పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తికాకముందే ఆ పనులు దక్కించుకునేందుకు పైరవీలు మొదలయ్యాయన్నప్రచారం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. టెండర్ నోటిఫికేషన్ రాకముందే నిధుల సమాచారం తెలుసుకున్న కొందరు తమకే ఆ పనులు కావాలని ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలోనూ పలు టెండర్లలో ఒకే వర్గానికి ప్రాధాన్యం దక్కిందని, నిబంధనలు అనుకూలంగా లేకుంటే రాజకీయ పలుకుబడిని ఉపయోగిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల జరిగిన ఓ టెండర్‌లో గద్వాలకు చెందిన వ్యక్తికి పని దక్కగా, అతనికి రూ.20 వేల వరకు ముట్టజెప్పి నాగర్‌కర్నూల్‌కు చెందిన వ్యక్తే ఆ పని దక్కించుకున్నారనే చర్చ సాగుతోంది.

రూ.15 లక్షల పనుల్లో వాస్తవ ఖర్చెంత?..

మినీ ట్యాంక్‌బండ్‌పై ప్రస్తుతమున్న నష్టాన్ని చిన్నపాటి మరమ్మతులతోనే సరిదిద్దవచ్చని, కానీ రూ.15 లక్షల భారీ మొత్తం కేటాయించడంపై స్థానికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంచనా వ్యయంలో వాస్తవంగా ఎంత ఖర్చవుతుంది, మిగిలేదెంత, నాణ్యతను ఎవరు పర్యవేక్షిస్తారనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. మరోవైపు పార్టీ కోసం సొంత ఖర్చులతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ సేవలందిస్తున్న కార్యకర్తలను పక్కనపెట్టి, ఎలాంటి ఖర్చు చేయని వ్యక్తులకే టెండర్లలో ప్రాధాన్యం ఇస్తున్నారన్న అసంతృప్తి పార్టీ శ్రేణుల్లో రగులుతోంది. కష్టపడే కార్యకర్తలను ప్రోత్సహించకుండా కొందరికే లబ్ధి చేకూర్చేలా వ్యవహరిస్తే రాజకీయంగా తీవ్ర నష్టం వాటిల్లుతుందని కేడర్ హెచ్చరిస్తోంది.

టెండర్లలో పారదర్శకత పాటించాలి..


టెండర్ల కేటాయింపుల్లో పక్షపాతం కొనసాగితే యువత పార్టీకి దూరమయ్యే ప్రమాదం ఉందని స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. మున్సిపాలిటీ పరిధిలోని పనుల్లో ఒక వర్గానికే అనుకూలంగా కాకుండా అర్హులైన కాంట్రాక్టర్లందరికీ సమాన అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు. మినీ ట్యాంక్‌బండ్ మరమ్మతు నిధుల వినియోగంలో పారదర్శకత ఉండేలా, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి విమర్శలకు తావులేకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



టెండర్ ద్వారానే పనులు కేటాయిస్తాం..

నాగర్‌కర్నూల్ పట్టణంలోని మినీ ట్యాంక్‌బండ్ మరమ్మతు పనులకు సంబంధించి జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ శాఖ ద్వారా మున్సిపాలిటీకి రూ.15 లక్షల నిధులు మంజూరయ్యాయని మున్సిపల్ కమిషనర్ స్పష్టం చేశారు. ఈ పనులకు సంబంధించి త్వరలోనే పారదర్శకంగా టెండర్లను ఆహ్వానిస్తామని తెలిపారు. నిబంధనల ప్రకారం టెండర్ ప్రక్రియ చేపట్టి, నాణ్యతా ప్రమాణాలతో పనులను వేగవంతంగా పూర్తి చేసే అర్హులైన కాంట్రాక్టర్లకే ఈ రూ.15 లక్షల పనులను కేటాయిస్తామని ఆయన అధికారిక వివరణ ఇచ్చారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
4
మంగళవారం 06.10.2026
www.kalamjyothi.com



హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- సొంత శ్రేణులకే కాంగ్రెస్‌పై నమ్మకం లేదు
- పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

కలంజ్యోతి, సంగెం (అక్టోబర్ 06) : సంగెం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కుంటపల్లి గ్రామ బీఆర్ఎస్ వార్డు సభ్యుడు రౌతు అనిల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడు రౌతు శివకోటి, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు రౌతు వరదరాజు, నాయకులు రౌతు రవీందర్, అశోక్, వేణు, రాజు, నాగరాజు, మినుముల పరమాత్మతో పాటు పలువురు పార్టీలో చేరారు. గతంలో రేపంత్‌రెడ్డి విజయం అనంతరం కుంటపల్లి నుంచి వేములవాడ వరకు పాదయాత్ర చేసిన రౌతు వరదరాజు సైతం గులాబీ గూటికి చేరడం ప్రాధాన్యత సంతరించుకుంది. అదేవిధంగా బిక్కోజినాయక్ తండా గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు గుగులోతు వెంకటేశ్వర్లు, నాయకులు బానోతు దేవసింగ్, బానోతు బొంద్యా, గుగులోతు హరిసింగ్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరగా, చల్లా ధర్మారెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

హామీల అమలులో సర్కార్ విఫలం..

ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజాపాలన పేరిట అధికార పీఠాన్ని దక్కించుకుని ప్రజలను మోసం చేస్తోందని, పాలకుల తీరుతో ప్రజా సమస్యలు గాలికొదిలేయడం వల్లే స్వంత పార్టీపై కార్యకర్తలకు నమ్మకం సడలిపోతోందని విమర్శించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు భరించలేకనే క్షేత్రస్థాయిలో ప్రజలు, ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్ వైపు తరలి వస్తున్నారని ఆయన స్పష్టం చేశారు.

పార్టీ కోసం శ్రేణులంతా సమష్టిగా కదలాలి..

బీఆర్ఎస్‌లో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం, తగిన ప్రాధాన్యం కల్పిస్తామని, గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. చల్లా నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని నూతనంగా చేరిన నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు పురం శ్రీనివాస్, ఎలుకుర్తి బుచ్చిరెడ్డి, గొపతి సారంగం, గొపతి రాజు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యూత్ విభాగం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణ డబ్బాలను తొలగించాలి

కలంజ్యోతి, నర్సాపూర్ (అక్టోబర్ 06) : అధికారుల అలసత్వం, కొందరు ప్రజాప్రతినిధుల అండదండలతో అక్రమార్కులు రోడ్డును కబ్జా చేస్తూ దర్జాగా డబ్బాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కాసాల పంచాయతీ పరిధిలోని 12వ వార్డులో రోడ్డును ఆక్రమించి, డ్రైనేజీని చిన్నాభిన్నం చేస్తూ డబ్బాలు వేసి అక్రమంగా కిరాయిల రూపంలో లాభపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

ఆక్రమణలు తొలగించాలి..

ఒకరు డ్రైనేజీపై అక్రమ నిర్మాణాలు చేపడితే, మరొకరు ఏకంగా రోడ్డు పైనే డబ్బాలు వేసి వ్యాపారాలు చేస్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుని ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని స్థానికులు వాపోయారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా, పంచాయతీకి రూపాయి ఆదాయం కూడా రాకుండా రోడ్డును ఆక్రమించి కిరాయిలకు ఇస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే అధికారులు రంగంలోకి దిగి రోడ్లు, డ్రైనేజీలపై వేసిన అక్రమ డబ్బాలను తొలగించి వాహనదారులకు, పాదచారులకు రక్షణ కల్పించాలని, నిర్లక్ష్యం వహిస్తే పెద్ద ఎత్తున ఆందోళన బాట పడతామని కాసాల గ్రామస్తులు స్పష్టం చేశారు.



గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

మంత్రి పొంగులేటి

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 06) : తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించి, రాష్ట్రాన్ని గుడిసెలు లేని ప్రాంతంగా మార్చడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల్లో నివసిస్తున్న సుమారు 72 వేల నుంచి 73 వేల మంది పేదలకు పక్కా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేశామని వెల్లడించారు. మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా, రెండో విడతలో మరో రెండు లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని



తెలిపారు. ఆర్థిక స్థోమత లేని లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించి ఇళ్ల నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నామని, అధికారులంతా సమన్వయంతో పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. అటవీ సంబంధిత సమస్యల వల్ల నిర్మాణాలు ఆగకుండా చూడాలని, అవసరమైతే ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

భూముల రక్షణకు ఆధార్ తరహాలో భూధార్..

రాష్ట్రంలో భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే సంకల్పంతో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భూముల సమగ్ర సర్వే చేపట్టిందని మంత్రి తెలిపారు. దాదాపు 125 ఏళ్ల క్రితం భూముల సర్వే జరిగిందని గుర్తుచేస్తూ, రాబోయే ఏడాదిన్నర కాలంలో రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో సర్వే పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించామని వివరించారు. మనిషికి ఆధార్ కార్డు ఎంత ప్రాధాన్యమో, ప్రతి భూ కమతానికి ప్రత్యేకంగా భూధార్ నంబర్ కేటాయించేలా పారదర్శక కార్యాచరణ చేపట్టామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గిరిజన ప్రాంతాల్లో రెవెన్యూ, అటవీ శాఖల మధ్య ఉన్న వివాదాలను సామరస్యంగా పరిష్కరించాలని సూచించారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో దశలవారీగా సర్వే చేపట్టి, ప్రతి భూ కమతానికి ల్యాండ్ పార్సెల్ మ్యాపింగ్ (ఎల్‌పీఎం) నంబర్ కేటాయించి రికార్డులు పక్కాగా నమోదు చేయాలని, తద్వారా భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా రైతులకు శాశ్వత భూ హక్కుల భరోసా కల్పిస్తామని స్పష్టం చేశారు.



వ్యవసాయ రహదారి హద్దులు తేల్చండి

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 05) : చెన్నారావుపేట మండలం జల్లి-మాధవనగర్ వ్యవసాయ రహదారిపై సమగ్ర సర్వే నిర్వహించి, రహదారి హక్కులు, హద్దులు, రికార్డులను అధికారికంగా నిర్ధారించాలని దాదాపు 150 మంది రైతులు ప్రభుత్వాన్ని కోరారు. సమస్యను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లిన కేవలం 17 రోజుల్లోనే స్పందించి క్షేత్రస్థాయి పరిశీలనకు చర్యలు తీసుకున్నందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీరాజ్, ల్యాండ్ సర్వే అధికారుల ఆధ్వర్యంలో సోమవారం రహదారిపై క్షేత్రస్థాయి సర్వే సాగింది. ఈ దారి తిమ్మారావుపేట శివారు పరిధిలో ఉన్నట్లు గుర్తించినప్పటికీ, సంబంధిత మ్యాప్‌లు, రికార్డుల్లో దారి వివరాలు స్పష్టంగా లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని రైతులు వివరించారు.

సమగ్ర రికార్డులు పరిశీలించి న్యాయం చేయాలి..

దాదాపు 50 ఏళ్లకు పైగా రైతులు, ప్రజలు నిరంతరం వినియోగిస్తున్నందున చట్టబద్ధమైన రహదారి హక్కును పరిగణనలోకి తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు. ఎఫ్‌ఎంబీ, అడంగల్, పహాణీలు, గ్రామ మ్యాప్‌లు, పంచాయతీ రికార్డులతో పాటు గతంలో ఉపాధి హామీ, ఇతర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. ఈ దారి ఏయే సర్వే నంబర్ల మీదుగా సాగుతోంది, పొడవు, వెడల్పు, హద్దులు, ప్రభుత్వ భూమి వివరాలను జీపీఎస్ ఆధారంగా పక్కాగా నిర్ధారించి అధికారిక మ్యాప్‌లో సమోదు చేయాలని స్పష్టం చేశారు. రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శక సర్వేతో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి అన్నదాతలను ఆదుకోవాలని 150 మంది రైతుల తరఫున కాట కుమారస్వామి విజ్ఞప్తి చేశారు.

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

5

మంగళవారం 06.10.2026

www.kalamjyothi.com



పేదల కంటికి పునర్జన్మ

- డబ్బు లేక ఎవరూ చూపు కోల్పోవద్దు
- 60 మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు
- జనతా ట్రస్ట్ చైర్మన్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి

కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 05) : ఆర్థిక స్థోమత లేక కంటి చూపు కోల్పోతున్న నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రధాన ధ్యేయంగా జనతా ట్రస్ట్ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తోందని ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడ శంకర ఐ హాస్పిటల్‌లో 60 మంది బాధితులకు ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేయించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన స్వయంగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందిస్తున్న సేవల వివరాలను రోగులతో మాట్లాడి తెలుసుకుంటూ, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.





కుటుంబాల్లో ఆశలు నింపడమే సంతృప్తి..

డబ్బు కొరత కారణంగా నిరుపేదలు కంటి చూపునకు దూరం కాకూడదనే లక్ష్యంతోనే నిరంతరం ఉచిత వైద్య సేవలు, ఆపరేషన్లు చేయిస్తున్నామని రాణా ప్రతాప్ రెడ్డి స్పష్టం చేశారు. మనిషికి చూపు దక్కడం అంటే ఆ కుటుంబానికి కొండంత ఆశను, ఆలంబనను కల్పించడమేనని, పేదల కళ్లలో ఆనందం చూడటమే తమకు నిజమైన సంతృప్తిని ఇస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, నల్లబెల్లి మండల అధ్యక్షుడు తడుక వినయ్ గౌడ్, రూరల్ అధ్యక్షుడు తనుగుల అంబేద్కర్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, కొంకిసా విగ్నేష్ గౌడ్, శివ, కుమార స్వామి, కిరణ్, గోస్కుల సందీప్, తాబేటి వంశీ, తేజ, తరుణ్ సాయి తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్‌పై ఎల్‌నినో ప్రభావం

ముందస్తు యాజమాన్య చర్యలు చేపట్టాలి

రైతు వేదికలో అవగాహన సదస్సు

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 05) : వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా రైతులు ఆయిల్‌పామ్ పంటలో ముందస్తు యాజమాన్య చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారులు పిలుపునిచ్చారు. చెన్నారావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ పంటపై ఎల్‌నినో ప్రభావం, నివారణ చర్యలు అనే అంశంపై రైతులకు శిక్షణ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ హెచ్ఓ రాకేష్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు వర్షపాతం, గాలిలో తేమ తగ్గిపోయే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తోటల్లో తగినంత తేమ నిలిచి ఉండేలా పక్కాగా నీటి యాజమాన్యం పాటించాలని, సమతుల్యపోషకాల వినియోగం, కలుపు నివారణతో పాటు తెగుళ్లు, కీటకాలను ప్రారంభ దశలోనే గుర్తించి నివారించాలని సూచించారు.



శాస్త్రీయ పద్ధతులతో అధిక దిగుబడులు..

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులను పాటిస్తూ ఉత్తమ యాజమాన్య పద్ధతులను అవలంబిస్తేనే నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారి గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఉద్యాన అధికారి తరుణ్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలు, సాంకేతిక సహకారాన్ని రైతులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎల్‌నినో పరిస్థితుల్లో తోటలను ఎప్పటికప్పుడు గమనిస్తూ యాజమాన్య చర్యలను సకాలంలో పూర్తి చేయాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓ (టీ) రాకేష్, ఉద్యాన అధికారి తరుణ్, ఏఓ గోపాల్ రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ వినోద్ కుమార్, సుమారు 60 మంది ఆయిల్‌పామ్ రైతులు పాల్గొన్నారు.



నూతన సాంకేతికను అందిపుచ్చుకోవాలి

విష్ణు విద్యా సంస్థల చైర్మన్ విష్ణు రాజు

బీవీఆర్ఐటీలో ఎం.టెక్ విద్యార్థుల ఇండక్షన్

కలంజ్యోతి, నర్సాపూర్ (అక్టోబర్ 05) : విద్యార్థులు పరిశ్రమలతో నిరంతరం అనుసంధానమై నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవాలని విష్ణు విద్యాసంస్థల చైర్మన్ కె. విష్ణు రాజు సూచించారు. నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలలో ఎం.టెక్ ప్రథమ సంవత్సరం నూతన విద్యార్థుల కోసం సోమవారం ఇండక్షన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కె.విష్ణు రాజు మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అభ్యసిస్తూ తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని దిశానిర్దేశం చేశారు. బీవీఆర్ఐటీ పూర్వ విద్యార్థుల సహకారం, వారి అనుభవాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు కెరీర్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ప్రాజెక్టులపై దృష్టి సారించాలి..

కళాశాల ఇప్పటికే పలు ప్రముఖ పరిశ్రమలు, ఈవీటీ టెక్నాలజీస్, ఇంజనీరింగ్ డిజైన్ సంస్థలతో అకడమిక్-ఇండస్ట్రీ భాగస్వామ్యాలను కొనసాగిస్తోందని, వీటి ద్వారా ఎం.టెక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని ప్రముఖ ఐఐటీలతో కలిసి పరిశోధన, అకడమిక్ సహకారాన్ని కొనసాగిస్తున్నామన్నారు. గౌరవ అతిథిగా హాజరైన విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ ఉన్నత విద్య ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థులు పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టరల్ పరిశోధనల వైపు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సామాజిక తెలంగాణే లక్ష్యం

పార్టీ బలోపేతానికి యువత సమష్టిగా పనిచేయాలి

టీఆర్ఎస్ నేత బోడ అనిల్ కుమార్

కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 05) : సామాజిక న్యాయం, సర్వోదయ తెలంగాణ సాధన దిశగా మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని యువత, రైతులు, మహిళలు ఐక్యంగా పోరాడాలని తెలంగాణ రక్షణ సేన నాయకుడు బోడ అనిల్ కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని గూడూరు, నర్సంపేట మండలాలకు చెందిన పలువురు నాయకులు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నూతనంగా చేరిన వారికి పార్టీ కండువలు కప్పి ఆహ్వానించిన అనంతరం ఆయన మాట్లాడారు. మహబూబాబాద్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేసేందుకు శ్రేణులంతా సమన్వయంతో కదలాలని కోరారు. ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తుతూ, పార్టీ సిద్ధాంతాలను ప్రతి గడపకూ చేర్చాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ, సంతోష్, వంశీ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.





కలం జ్యోతి
తెలుగు దినపత్రిక



స్వయంకృషితోనే ఈ స్థాయికి..

తన ఇల్లు, కార్యాలయాలపై ఐటీ దాడులు జరిగాయంటూ సాగుతున్న అసత్య ప్రచారాలను సినీ నటి రకుల్ ప్రీత్‌సింగ్ తీవ్రంగా ఖండించారు. ఈ సోదాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని సామాజిక మాధ్యమాల వేదికగా స్పష్టం చేశారు. చిత్రపరిశ్రమలో గాడ్‌ఫాదర్లు లేకుండా కేవలం సొంత కష్టంతోనే ఎదిగానని, 20 ఏళ్ల వయసు నుంచే క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నానని పేర్కొన్నారు. తనకు బినామీ ఆస్తులు, చట్టవిరుద్ధ లావాదేవీలు లేవని తేల్చిచెబుతూ, కేవలం సంచలనం కోసం పరువు తీసేలా తప్పుడు కథనాలు రాసిన మీడియా సంస్థలు వెంటనే వాటిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.